కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఖలీల్‌వాడి, డిసెంబర్ 18: ఫీజు రీయింబర్స్ మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లాకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.180 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ స్పందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేశ్, నాయకులు చక్రి, రాజు, వినీత్, సుజిత్, సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

'బస్‌జాత' వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆశ కార్యకర్తలు

రుద్రూర్, డిసెంబర్ 18 : తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆశ కార్యకర్తలు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నేడు గురువారం బస్‌జాత కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్లను రుద్రూర్ పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తలు బుధవారం ఆవిష్కరించా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫిబ్రవరిలో నిర్వహించనున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశ కార్యకర్తల వేతనాన్ని రూ.18వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వాణి, భూలక్ష్మి, రంజన, లక్ష్మి, గంగామణి, ప్రవళిక, శోభ, పుష్ప, నాగమణి, ప్రేమల, సునీత తదితరులు పాల్గొన్నారు.

దక్కన్ సర్కార్ సినిమా పోస్టర్..

సుభాష్‌నగర్, డిసెంబర్ 18: జిల్లాకు చెందిన కళాశ్రీనివాస్ ఆధ్వర్యంలో దక్కన్ సర్కార్ సినిమా తెరకెక్కనున్నది. ఇందుకు సంబంధించిన సినిమా పోస్టర్‌ను లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ హైదరాబాద్‌లోని లోక్‌సత్తా కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సినిమా విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంగీత దర్శకుడు మల్లిక్, చిత్రహీరో చాణక్య, రంగనాయకుల సంతోష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

దక్కన్ సర్కార్ సినిమా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జయప్రకాశ్ నారాయణ

మాతృభాషను మరవొద్దు

- టీయూ వీసీ ప్రొఫెసర్ యాదగిరి రావు
- వర్సిటీలో అధ్యాపకులకు పునశ్చరణ తరగతులు

మాట్లాడుతున్న టీయూ వీసీ ప్రొఫెసర్ యాదగిరిరావు

డిచ్‌పల్లి, డిసెంబర్ 18: ఇతర భాషలను నేర్చుకున్నప్పటికీ మాతృభాషను మరవొద్దని టీయూ వీసీ ప్రొఫెసర్ యాదగిరిరావు అన్నారు. తెలంగాణ యూనివర్సిటీ తెలుగు విభాగం, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా లాంగ్వేజెస్ (భారతీయ భాషా విభాగాల సంస్థ), తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు అధ్యాపకులకు ఏడు రోజుల పునశ్చరణ తరగతులు టీయూలో బుధవారం ప్రారంభమయ్యాయి. వీసీ యాదగిరి రావు మాట్లాడుతూ.. విద్యావికాసానికి మాతృబాషలు ఉపయుక్తంగా ఉంటాయన్నారు. పునశ్చరణ తరగతులతో తెలుగు పాఠ్య ప్రణాళికలో నూతన రూపకల్పనలు ఉంటాయని తెలిపారు. కీలకోపాన్యాసకులుగా హాజరైన ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ఆదిమ మానవుడి కాలం నాటి నుంచి నేటి వరకు భాష ఏ విధంగా పరిణామం చెందిందో వివరించారు. ప్రాచీన సాహిత్యం అధ్యయనంతో కలిగే ప్రయోజనం, పరిణతిని విద్యార్థులకు వివరించాలని అధ్యాపకులకు సూచించారు. తరగతులకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఇతర రాష్ట్రాల్లోని తెలుగు అధ్యాపకులు దాదాపు 60 మంది హాజరయ్యారు. టీయూ ప్రిన్సిపాల్ ఆచార్య ఆరతి, కార్యక్రమ నిర్వాహకురాలు కరిమండ్ల లావణ్య, సంస్థ కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇండ్లే టార్గెట్

నిజామాబాద్‌లో మూడు, కమ్మర్‌పల్లిలో పది ఇండ్లలో చోరీ

నిజామాబాద్‌లో వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్ సభ్యులు

వినాయక్‌నగర్, డిసెంబర్ 18: నగరంలో ఒకే రోజు మూడు ప్రదేశాల్లో చోరీ జరిగింది. తాళం వేసిన ఇంటితోపాటు మెడికల్‌షాపు, ల్యాబ్‌లో దుండగులు చేతివాటం ప్రదర్శించారు. పోలీసులు, బాధితులు తెలిపిన ప్రకారం.. వన్‌టౌన్ పరిధిలోని ఖలీల్‌వాడిలో ఉన్న గౌతమి పాథోలాజికల్ ల్యాబ్ షటర్‌ను మంగళవారం రాత్రి దుండగులు ధ్వంసం చేసి లోపలికి వెళ్లారు. రూ.పదివేల నగదు ఎత్తుకెళ్లారు. బుధవారం ఉదయం గమనించిన ల్యాబ్ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌హెచ్‌వో రఘుపతి, ఎస్సై-2 మొగులయ్య ఘటనా స్థలాన్ని సందర్శించి క్లూస్ టీమ్‌తో వివరాలు సేకరించారు. నగరంలో రెండో టౌన్ పరిధిలో ఉన్న గంగా మెడికల్ షాపులో చోరీకి యత్నించారు. షటల్ ధ్వంసం చేసి లోనికి ప్రవేశించినా.. అక్కడ ఏమీ లభించకపోవడంతో వెనుదిరిగారు. ఆరో టౌన్ పరిధిలోని ఆటోనగర్‌లో నివసించే షబానా బేగం నిత్యం రాత్రి తాళం వేసి అదే ఏరియాలో ఉండే తన తల్లిగారి ఇంటి వద్ద నిద్రిస్తుంది. మంగళవారం రాత్రి తాళం వేసి వెళ్లగా.. బుధవారం ఉదయం వచ్చి చూసేసరికి తాళం ధ్వంసం చేసి ఉన్నది. చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఆరో టౌన్ పోలీసులు అక్కడికి చేరుకొని వివరాలు సేకరించారు. ఎనిమిది తులాల బంగారు నగలు పోయాయని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సౌత్ రూరల్ సీఐ సురేశ్‌కుమార్ తెలిపారు.

కమ్మర్‌పల్లిలో పది ఇండ్లల్లో..

మోర్తాడ్, డిసెంబర్ 18: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో మంగళవారం రాత్రి సుమారు పది ఇండ్లలో దుండగులు చోరీకి యత్నించారు. సిరిగిరి శ్రీనివాస్, చింత గణేశ్, పిల్లమారి సుధాకర్ ఇండ్ల తాళాలు పగలగొట్టి లోనికి వెళ్లారు. బీరువాలు వెతికినా ఏమీ దొరకకపోవడంతో వెళ్లిపోయారు. కలల శ్రీలేఖ అద్దెకు ఉంటున్నది. ఈనెల 16న ఆమె తల్లిగారి ఇంటికి ఖానాపూర్ వెళ్లింది. ఈ ఇంటి తాళం పగలగొట్టి బీరువాను తెరిచి అందులో ఉన్న అరుతులం బంగారు ఉంగరం, 18 తులాల వెండి ఆభరణాలు, కొంత నగదును దోచుకెళ్లారు. డాక్టర్ రమేశ్‌కు చెందిన స్కూటీని ఎత్తుకెళ్లి గ్రామశివారులో ధ్వంసం చేసి వదిలి వెళ్లారు. దొంగలు తాళాలు పగలగొట్టిన ఇండ్లను భీమ్‌గల్ సీఐ నవీన్‌కుమార్, ఎస్సై అనిల్ రెడ్డి బుధవారం పరిశీలించారు. బాధితురాలు శ్రీలేఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గ్రామసేవకుడిపై దాడిచేసిన వ్యక్తికి జైలు

కోటగిరి, డిసెంబర్ 18: గ్రామ సేవకుడిపై దాడి చేసిన వ్యక్తికి మూడేండ్ల జైలు శిక్షతోపాటు రూ.నాలుగు వేల జరిమానా విధిస్తూ బోధన్ కోర్టు జడ్జి సాయిశివ బుధవారం తీర్పు వెలువరించారని ఎస్సై సందీప్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. కోటగిరికి చెందిన ఖలీం నవంబర్8,2016న గ్రామంలోని దామర చెరువు తూమును విప్పడానికి ప్రయత్నించాడు. అక్కడ కాపలా ఉన్న గ్రామ సేవకులు అడ్డుకున్నారు. దీంతో వారిపై ఖలీం భౌతికదాడి చేయడంతోపాటు చంపుతానని బెదిరించాడు. ఈ విషయమై పోలీసులు కేసు నమోదు చేసి, కోర్టులో చార్జిషీట్ వేశారు. కేసును బుధవారం విచారించిన జడ్జి సాయిశివ నిందితుడికి మూడేండ్ల జైలు శిక్ష, రూ.నాలుగు వేల జరిమానా విధించారు. బాధితుల తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీహెచ్ రాణి వాదనలు వినిపించారు. ఎస్సై జి.సందీప్. కోర్టు కానిస్టేబుల్ సంతోష్.. సాక్షులను హాజరు పరిచారు.

హత్య కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు

వినాయక్‌నగర్, డిసెంబర్ 18: నగరంలోని గంజ్ ప్రాంతంలో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి బుధవారం తెలిపారు. మిర్చికాంపౌండ్‌కు చెందిన గైక్వాడ్ చంద్రకాంత్(22)కు ఈనెల 15వ తేదీన గంజ్ ఏరియాలో బైకులు అడ్డుపెట్టిన యువకులతో గొడవ జరిగింది. దీంతో వారు అతడిని నెట్టివేయడంతో డ్రైనేజీలో పడి మృతిచెందాడు. మృతుడి అన్న ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. యువకులు పరారీలో ఉండగా.. ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించారు. వినాయక్‌నగర్‌కు చెందిన రచకట్ల మనీశ్, చిట్లు సాయికృష్ణ, రసగోని రుత్విక్‌గౌడ్‌ను బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. వారిని కోర్టులో హాజరు పరిచి, రిమాండ్‌కు తరలించామన్నారు.

అదృశ్యం కేసు నమోదు

వినాయక్‌నగర్, డిసెంబర్ 18: నగరంలోని గౌసియా మసీద్ ప్రాంతం నుంచి ఓ యువతిని మాలపల్లికి చెందిన ఆమె బంధువు మక్దూమ్ సోమవారం కిడ్నాప్ చేశాడని యువతి కుటుంబ సభ్యులు ఆరోటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె వివాహం నిశ్చయమైందని, గురువారం పెండ్లి జరగాల్సి ఉన్నదని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో సౌత్ రూరల్ సీఐ సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు విచారణ చేపట్టారు. యువతి ఇష్టపూర్వకంగానే అతడితో వెళ్లిందని, దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేశామని సౌత్ రూరల్ సీఐ వెల్లడించారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

సిరికొండ, డిసెంబర్ 18: మండలంలోని తాటిపల్లి గ్రామానికి చెందిన మాలావత్ సుగుణ ఇల్లు విద్యుదాఘాతంలో కాలిపోయింది. ఇంట్లోని టీవీ, ఫ్రిజ్‌తోపాటు రూ.నాలుగు లక్షల విలువైన వస్తువులు, ఇల్లు కాలిపోయాయని గిర్దావర్ నాగన్న తెలిపారు. ఘటనా స్థలాన్ని ఎస్సై రామ్ పరిశీలించారు.

చక్కెర ఫ్యాక్టరీలను తెరవకుంటే ఉద్యమమే..



మాట్లాడుతున్న ఆకుల పాపయ్య

ఖలీల్‌వాడి, డిసెంబర్ 18: జిల్లాలోని ఎన్ఎస్ఎఫ్, ఎన్‌సీఎస్ఎఫ్‌ను ప్రభుత్వం తెరవకపోతే వందలాది ట్రాక్టర్లతో రైతు ఉద్యమం చేపడుతామని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య హెచ్చరించారు. నగరంలోని ధర్నాచౌక్‌లో 200 మంది రైతులతో బుధవారం ధర్నా నిర్వహించిన అనంతరం మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జిల్లాలోని రెండు షుగర్ ఫ్యాక్టరీలను వెంటనే తెరిపించాలని డిమాండ్ చేశారు. సబ్ కమిటీ వేసి కాలయాపన చేస్తూ ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో నాయకులు నాగయ్య, సాయిరెడ్డి, సాయిలు, పర్వయ్య, ఎర్రన్న, దేవన్న, కృష్ణాగౌడ్, బన్సీ, మార్క్స్, బాబూరావు, శ్రీనివాస్ రెడ్డి, అరుణ, సుప్రియ, లక్ష్మి, సూర్యశివాజీ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల చదువుపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలి

కోటగిరి, డిసెంబర్ 18: విద్యార్థుల చదువుపై తల్లిదండ్రులు దృష్టిసారించాలని కోటగిరి ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఖైసర్‌పాషా అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాన్ని కాలేజీలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. విద్యార్థులు క్రమం తప్పకుండా కాలేజీకి వచ్చేలా తల్లిదండ్రులు చూడాలన్నారు. సమావేశంలో అధ్యాపకులు ప్రమోద్, దత్తాద్రి, ఆమోష, అర్షియా షాదుల్లా, ప్రభాకర్, హసన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నాటుకోళ్ల పెంపకంతో అధిక లాభాలు


నాటుకోళ్ల యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఏపీడీ రవీందర్

సారంగాపూర్, డిసెంబర్ 18: నాటుకోళ్ల పెంపకంతో అధిక లాభాలు గడించవచ్చని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఏపీడీ రవీందర్ అన్నారు. గుండారం గ్రామ డ్వాక్రా సంఘం సభ్యురాలు గంగామణికి శ్రీనిధి ద్వారా రూ.మూడు లక్షల రుణ సహాయంతో ఏర్పాటుచేసిన నాటుకోళ్ల పెంపకం మదర్ యూనిట్‌ను డీపీఎంలు ముత్యాల మారుతి, సంధ్యారాణి, ఏపీఎం మహేశ్‌కుమార్‌తో కలిసి ఆయన బుధవారం ప్రారంభించారు. ఎంఎస్ అధ్యక్షురాలు సునీత, సీసీ సంతోష్‌కుమార్, వీవోఏలు దీప, లావణ్య, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

రుద్రూర్, డిసెంబర్ 18: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు రుద్రూర్ ఆదర్శ పాఠశాల ఎదుట బుధవారం నిరసన వ్యక్తంచేశారు. అనంతరం ఎంపీడీవో సురేశ్‌బాబు, తహసీల్దార్ శాంతాబాయి, ఎంఈవో కార్యాలయంలో వినతిపత్రాలను అందజేశారు. ప్రిన్సిపాల్ సతీశ్‌తోపాటు ఫిరోజ్, బలరాం, రాఘవేంద్ర, జ్యోతి, అనిల్, సాయి కృష్ణ, సంతోష్, సోపన్ తదితరులు పాల్గొన్నారు.

1,108 ఇండ్ల సర్వే పూర్తి

ధర్పల్లి, డిసెంబర్ 18: మండలంలో బుధవారం వరకు 1,108 ఇందిరమ్మ ఇండ్ల సర్వే పూర్తయ్యిందని ఎంపీడీవో బాలకృష్ణ తెలిపారు. మొత్తం 9,036 మంది దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. ఇండ్ల వద్దకు వెళ్లి పూర్తి వివరాలు సేకరిస్తున్నామన్నారు.

రిద్ధికి బుల్లితెర అవార్డు

సుభాష్‌నగర్, డిసెంబర్ 18: జిల్లా కేంద్రానికి చెందిన రిద్ధి హైదరాబాద్ శిల్పారామంలో మంగళవారం రాత్రి నిర్వహించిన కూచిపూడి నృత్యంలో ప్రతిభ చూపింది. దీంతో ఆమెకు నిర్వాహకులు బుల్లితెర అవార్డును అందజేసినట్లు శాంతిచంద్రిక వరవీణ మ్యూజిక్ అకాడమీ నిర్వాహకుడు చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకల్లో నిర్వాహకులతోపాటు ఉదయభాను, శ్రీలక్ష్మి, వరలక్ష్మి, పూరి ఆకాశ్, జేడీ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధర్మ సమాజ్ పార్టీ దీక్ష భగ్నం

ఖలీల్‌వాడి, డిసెంబర్ 18: మధ్య తరగతి కుటుంబాలకు వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు సాధన కోసం ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు మూడు రోజులుగా నగరంలోని ధర్నా చౌక్ వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు. వారి దీక్షను పోలీసులు బుధవారం భగ్నం చేశారు. ఆందోళన చేస్తున్న సుమన్ మహరాజ్, మహిపాల్ మహరాజ్‌ను జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

జాతీయస్థాయి క్రీడాకారులకు సన్మానం

జక్రాన్‌పల్లి, డిసెంబర్ 18: మండలంలోని పడకల్ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన గోసంగి రిత్విక్, వోల్కాజి చందన జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశంలో వారితోపాటు ఫిజికల్ డైరెక్టర్ గడ్డం శ్రీనివాస్‌ను కాంప్లెక్స్ హెచ్ఎం సురేందర్‌రెడ్డి సన్మానించారు. రిత్విక్ జమ్మూకాశ్మీర్‌లో నిర్వహించిన జాతీయస్థాయి సబ్ జూనియన్స్ టెన్నికాయిట్ పోటీలు, చందన ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసిలో నిర్వహించిన అండర్-14 వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నదని పీడీ తెలిపారు.

నోట్‌బుక్స్ అందజేత

నందిపేట్, డిసెంబర్ 18 : అయిలాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు, నోట్‌బుక్స్‌ను లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అయిలాపూర్ సొసైటీ మాజీ చైర్మన్ లక్ష్మీనారాయణ బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్ శౌరిబాబు, సాయిరెడ్డి, భూమన్న, మండల అధ్యక్షుడు మహిపాల్, నర్సయ్య, హెచ్ఎం లాలయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

మాక్లూర్, డిసెంబర్18: దాస్‌నగర్‌లోని ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో బుధవారం నార్కోటిక్ పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పోస్టర్లను పోలీసులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నార్కోటిక్ సీఐలు పూర్ణేశ్వర్, నర్సింహులు, ఎస్సై రాజశేఖర్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ అధికారుల 'పొలం బాట'

ఎడపల్లి, డిసెంబర్ 18: మండల కేంద్రంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం రైతు పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. ట్రాన్స్‌కో డీఈ టెక్నికల్ రమేశ్, ఎడపల్లి విద్యుత్ సబ్ డివిజన్ ఏడీఈ ప్రభాకర్ మాట్లాడారు. కార్యక్రమంలో ఏఈ కిశోర్ రెడ్డి, సీనియర్ లైన్‌మన్ శంకర్‌నాయక్, సత్యనారాయణ, పాషా, లైన్‌మన్ పవన్ పాల్గొన్నారు.

తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలి

- అదనపు కలెక్టర్ అంకిత్

బాల్కొండలో సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

బాల్కొండ/రెంజల్, డిసెంబర్ 18: ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను గుర్తించేందుకు నిర్వహిస్తున్న సర్వే వివరాలను తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అదనపు కలెక్టర్ అంకిత్ సూచించారు. బాల్కొండ మండల కేంద్రంలో కొనసాగుతున్న సర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. సర్వే నిర్వహిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. బాల్కొండ, చిట్టాపూర్ గ్రామాల్లో పర్యటించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీవో విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎంపీవో గంగామోహన్, పంచాయతీ కార్యదర్శి రజనీకాంత్‌రెడ్డి, ఆర్ఐ గంగాధర్, జూనియర్ అసిస్టెంట్ ప్రభాకర్ ఉన్నారు. రెంజల్ మండలంలోని తాడ్‌బిలోలి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే చేపడుతున్నట్లు తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. అర్హులైన వారి పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిబ్బందికి తహసీల్దార్ సూచించారు.

ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలి

బాల్కొండ/ఆర్మూర్‌టౌన్, డిసెంబర్ 18: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులంతా బాధ్యతగా, అంకితభావంతో పని చేయాలని ఎంఈవో రాజేశ్వర్ అన్నారు. బాల్కొండ ప్రాథమిక పాఠశాలలో బుధవారం నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ స్థాయి ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కిసాన్‌నగర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రాజేంద్ర కుమార్, జడ్పీహెచ్ఎస్ కాంప్లెక్స్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.ఆర్మూర్ మండలంలోని పిప్రి జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఆర్మూర్ ఎంపీడీవో సాయిరాం, ఎంఈవో రాజగంగారాం హాజరై మాట్లాడారు.

దాడికేసులో ఏడుగురి రిమాండ్

రెంజల్, డిసెంబర్ 18: మండలంలోని వీరన్నగుట్ట తండాలో ఈనెల 13న రేడ్యానాయక్‌పై దాడి చేసి ఆయన ఆత్మహత్యకు కారణమైన ఏడుగురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు బోధన్ రూరల్ సీఐ విజయ్‌బాబు బుధవారం తెలిపారు. ఈ కేసులో 13 మంది నిందితులు ఉన్నారని, మిగతా ఆరుగురిపై విచారణ జరుగుతున్నదని తెలిపారు. వారిని త్వరలోనే రిమాండ్‌కు తరలిస్తామని పేర్కొన్నారు.

జీపీ కార్మికుల అరెస్టుపై నిరసన

డిచ్‌పల్లి ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న నాయకులు, కార్మికులు

బోధన్/డిచ్‌పల్లి, డిసెంబర్ 18: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 17న చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు, నాయకుల అరెస్ట్‌ను నిరసిస్తూ బోధన్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పంచాయతీ కార్మికులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు సాగర్, మల్లేశ్, పోశెట్టి, విజయ్‌పటేల్, శివయ్య బాబురావు, నాగ్‌నాథ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు. డిచ్‌పల్లిలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట టీయూసీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. టీయూసీఐ నాయకుడు మురళి, కారోబార్ల సంఘం అధ్యక్షుడు సురేశ్ మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులను అర్ధరాత్రి అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు రవి, పోశెట్టి, సంజు, సాయిలు, దుర్గ, రాజేశ్వర్, కృష్ణ, రమేశ్, రవి, మహేశ్, బాలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు క్రీడాకారులు

కంఠేశ్వర్, డిసెంబర్ 18: జమ్మూకాశ్మీర్‌లో ఈనెల 20నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న 37వ జాతీయ సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు బుధవారం బయల్దేరి వెళ్లారు. మెదక్, వరంగల్‌లో ఇటీవల నిర్వహించిన బాల, బాలికల రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చూపారని అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, మార్కంటి గంగామోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలికల విభాగంలో బి.నిశిత, జి.వర్షిని, డి.కీర్తన (సుద్దపల్లి), ఆర్.సౌజన్య (ఆర్మూర్), కె.సంహిత (ధర్మారం), బాలుర విభాగంలో ఎన్.ప్రణయ్, బి.రోహిత్ (ఉప్పల్‌వాయి), కె.సాయిబాబా(ఆర్మూర్), టి.రింటు(వేల్పూర్) రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

కంఠేశ్వర్, డిసెంబర్ 18: జిల్లాకు చెందిన తైక్వాండో క్రీడాకారిణి శ్రీరాఘ పూజిత జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున పాల్గొనేందుకు ఎంపికైందని క్యూరియస్ తైక్వాండో అకాడమీ కోచ్ వినోద్‌నాయక్ బుధవారం తెలిపారు. నవంబర్‌లో స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో సంగారెడ్డిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందని తెలిపారు. ఈనెల 18 నుంచి 24 వరకు మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టులో పూజిత పాల్గొంటుందని తెలిపారు. ఈ సందర్భంగా యువనాయకుడు నరేశ్ రూ.10 వేల ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత

వినాయక్‌నగర్, డిసెంబర్ 18: నగరంలోని ఫోర్త్ టౌన్ ఏరియాలో ఇటీవల తమ ఫోన్లు పోగొట్టుకున్న తొమ్మిది మంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వాటి ఆచూకీ కనుగొని స్వాధీనం చేసుకున్నారు. సెల్‌ఫోన్లను బాధితులకు బుధవారం అందజేశామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

చీటింగ్ కేసులో వ్యక్తికి జైలుశిక్ష

శక్కర్‌నగర్, డిసెంబర్ 18: బోధన్ మండలం కల్దుర్కి గ్రామానికి చెందిన బుయ్యన్‌వార్ హన్మంతుకు చీటింగ్ కేసులో ఏడాదిన్నర పాటు జైలుశిక్షను విధిస్తూ బోధన్ జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు బుధవారం తీర్పు ఇచ్చింది. 2015లో నమోదైన ఈ కేసులో నిందితుడు హన్మంతు నేరం రుజువు కావడంతో జైలుశిక్షతోపాటు రూ.1000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి పూజిత తీర్పు చెప్పారు. ఈ కేసు దర్యాప్తు చేసిన ఎస్సై ప్రభాకర్, విచారణకు సహకరించిన ఎస్‌హెచ్‌వో వెంకట నారాయణ, కోర్టు కానిస్టేబుళ్లు సృజన్, లక్ష్మణ్‌ను సీపీ అభినందించినట్లు పోలీస్ అధికారులు తెలిపారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు హాసాకొత్తూర్ విద్యార్థులు

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మోర్తాడ్, డిసెంబర్ 18: కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు ప్రతిభ, సంగీత, ఉదయ్‌కుమార్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం బుస కృష్ణకుమార్ బుధవారం తెలిపారు. వరంగల్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు, వీరికి శిక్షణను ఇచ్చిన పీడీ మాధురిని బుధవారం హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసమూర్తి, నరేందర్, షేక్‌జాన్‌పాషా, శ్రీనివాస్‌దాసు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

డిచ్‌పల్లి/ ఇందల్వాయి/ జక్రాన్‌పల్లి, డిసెంబర్ 18: సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలను హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఈనెల 21వ తేదీ వరకు నిర్వహించనున్నారు. సీనియర్ బేస్‌బాల్ పోటీలకు ఇందల్వాయి గ్రామానికి చెందిన కొటాల శ్రీకర్ ఎంపికైనట్లు బేస్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్‌రెడ్డి, సొప్పరి వినోద్ బుధవారం తెలిపారు. శ్రీకర్‌ను సాఫ్ట్‌బాల్ జిల్లా కార్యదర్శి మర్కంటి గంగామోహన్, పీడీ కొటాల సంజీవ్, కోచ్ నరేశ్ తదితరులు అభినందించారు. రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు సుద్దులంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన బిందు, నేహ, మహేశ్వరి, శ్రీశరణ్య ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నళిని తెలిపారు. రాష్ట్రస్థాయిలో సత్తా చాటాలని సూచించారు. వారిని ప్రిన్సిపాల్‌తోపాటు వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, పీఈటీ శ్రీలత, అకాడమీ కోచ్ వేముల మౌనిక అభినందించారు. జక్రాన్‌పల్లి మండలంలోని తొర్లికొండ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన నవకాంత్, శేఖర్ రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ గంగామోహన్ తెలిపారు. విద్యార్థులను హెచ్ఎం, ఎంఈవో శ్రీనివాస్, ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు.

సైన్స్ టాలెంట్‌టెస్ట్‌లో చౌట్‌పల్లి విద్యార్థిని ప్రతిభ

మోర్తాడ్, డిసెంబర్ 18: జిల్లాస్థాయిలో బుధవారం నిర్వహించిన బయాలాజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని సబాసాదియా ప్రతిభ చూపి జిల్లాలో రెండో స్థానంలో నిలిచిందని ఎంఈవో ఆంధ్రయ్య తెలిపారు. డీఈవో అశోక్ చేతుల మీదుగా అవార్డుతోపాటు రూ.వెయ్యి నగదు అందుకున్నట్లు తెలిపారు. ఇంతవరకు మండలస్థాయిలో అన్ని సబ్జెక్టుల్లో టాపర్‌గా నిలిచి, గణితంలో జిల్లాస్థాయి మూడోస్థానంలో నిలిచిందని చెప్పారు.

'మధ్యాహ్న భోజనంపై నిర్లక్ష్యం వద్దు'

మోర్తాడ్/చందూర్, డిసెంబర్ 18: మధ్యాహ్న భోజన విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని, మెనూ ప్రకారమే విద్యార్థులకు భోజనాన్ని అందించాలని కమ్మర్‌పల్లి ఎంపీడీవో రాజశ్రీనివాస్ సూచించారు. కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్ ఉన్నతపాఠశాలను బుధవారం పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులు వడ్డించే వరకు పరిశీలించారు. అనంతరం విద్యాబోధన, హాజరు రిజిష్టర్లను పరిశీలించారు.చందూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తహసీల్దార్ శాంత బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. అనంతరం కారేగాం అంగన్‌వాడీ సెంటర్, లక్ష్మాపూర్‌లో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో కార్యదర్శి నరేందర్, ఉపాధ్యాయుడు వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్ష

కంఠేశ్వర్, డిసెంబర్ 18: నగరంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేస్తున్న దీక్ష కొనసాగుతున్నది. ధూంధాం కార్యక్రమం ద్వారా బుధవారం నిరసన చేపట్టారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించే వరకూ ఆందోళన కొనసాగుతుందని ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వారికి పీఆర్టీయూ నాయకులు మద్దతు తెలిపారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

బోధన్, డిసెంబర్ 18: శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలని డీహెచ్ఈడబ్ల్యూ మిషన్ జిల్లా సమన్వయకర్త స్వప్న సూచించారు. బుధవారం బోధన్ పట్టణంలోని ప్రభుత్వ మధుమలంచ జూనియర్ కళాశాలలో మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు వృత్తి విద్యపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీహెచ్ఈడబ్ల్యూ జిల్లా సమన్వయకర్త స్వప్న మాట్లాడుతూ ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన కేంద్రంలో యువతకు వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం అందిస్తున్న కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆసియా, ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన ముబలైజర్ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

నవీపేట,డిసెంబర్ 18: నిజాంపూర్‌తోపాటు పలు గ్రామాల్లో నారు మడులను ఏవో నవీన్‌కుమార్ బుధవారం పరిశీలించారు. చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందున తీసుకోవాల్సి జాగ్రత్తలను రైతులకు వివరించారు. నారు మడిలో రాత్రి వేళలో నీరు లేకుండా చూడాలని చెప్పారు. చలి తీవ్రత ఎక్కువగా ఉంటే నారు మడిపై అడుగు ఎత్తులో పలుచని పాలిథీన్ షీట్ లేదా పట్టాలను సాయంత్రం వేళలో కప్పి ఉదయం పూట తీసివేయాలని సూచించారు. సందేహాలుంటే తమను సంప్రదించాలని కోరారు.

డైరీల వితరణ

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్18: పట్టణంలోని బార్ అసోసియేషన్‌కు సంగారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి డైరీలు అందజేశారని బార్ అసోసియేషన్ ఆర్మూర్ అధ్యక్షుడు తెడ్డు నర్సయ్య బుధవారం తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు లోక భూపతి రెడ్డి, గంగారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, గటడి ఆనంద్, ప్రవీనందన్, అజిత్, పోచన్న పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

పాస్‌పోర్ట్ పోయినది

★నేను కొండాయి హరీష్ తండ్రి కొండాయి పోశెట్టి ఇ.నెం. 2-17, గ్రా|| జానకంపేట్, మం||ఎడపల్లి ,జి|| నిజామాబాద్, తెలంగాణ రాష్ట్రం నేను 9-12-2024 రోజున ఎడపల్లి నుండి జానకంపేట్‌కు వచ్చేటప్పుడు నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు నెం.L6713487 ఎక్కడో పడిపోయినది. కావున దొరికిన వారు సంప్రదించండి సెల్: 8498900531

NTZ-000

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

జాగ్రత్తలు పాటించాలి